క్లుప్తంగా

ప్రశాంతంగా టెన్త్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష

కంచికచర్ల: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రెండవ రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ బి.బాలాజీ మంగళవారం తెలిపారు. కంచికచర్లలో ఆరు పరీక్ష కేంద్రాల్లో సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష జరగ్గా 925మందికి గాను 901మంది పరీక్ష రాశారు. ఆరుగురు గైర్హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు.

నేడు వేదాద్రి హుండీ కానుకల లెక్కింపు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ హుండీ కానుకల లెక్కింపు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఈవో హేమలతాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖాధికారుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని కోరారు.

సీతారాముల కల్యాణం



నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో 71వ రామకోటి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మంగళవారం సీతారాముల కల్యాణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రాల నడుమ స్వామి వారి కల్యాణ కార్యక్రమం జరిగింది. సాయంత్రం సమయంలో పలు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు



నందిగామ: అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని ఏసీపీ బి.రవికిరణ్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి సమయంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో తెలంగాణ నుంచి ద్విచక్ర వాహనంపై 75 మద్యం సీసాలు తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నిత్యం వాహన తనిఖీలు కొనసాగుతాయన్నారు. తెలంగాణ నుంచి అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐ హనీష్, ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

యోగాసనాలపై అవగాహన



కొణకంచి(పెనుగంచిప్రోలు): పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ర్యాలీలు, యోగాసనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని కొణకంచి గ్రామంలో ఆరోగ్య సూత్రాలు, తల్లులు, పిల్లలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారి కె.వాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

జి.కొండూరు: తెలంగాణ రాష్ట్రం, ఎర్రుపాలెం నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లతో జి.కొండూరు వైపు వస్తున్న పొట్లదుర్తి సాంబశివరావుని గంగినేని శివారులోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద జి.కొండూరు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 24 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ తెలిపారు.

రూపురేఖలు మారిన చౌటపల్లి

- గ్రామంలో గణనీయమైన అభివృద్ధి
- జగనన్న కాలనీ ఇళ్లు, పాఠశాల నూతన భవనాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం
- అద్దంలా మెరుస్తున్న సీసీ రోడ్లు
- రూ.22.25 కోట్ల మేరకు సంక్షేమం



గ్రామంలో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

చౌటపల్లి(వీరులపాడు): మండల పరిధిలోని చౌటపల్లి గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గత టీడీపీ పాలకుల పాలనలో నిరాదరణకు గురై కనీస వసతులు లేక ప్రజల అవస్థలు పడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామం గణనీయమైన అభివృద్ధిని సాధించింది. నందిగామ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కృషితో గ్రామాభివృద్ధికి రూ.కోట్లలో నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు మౌలిక వసతులు కల్పించటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.36 లక్షలతో పాఠశాలల అభివృద్ధి..

గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతో పాటు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రూ.36 లక్షలతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు విద్యార్థులకు బల్లలు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణం, తదితర వసతులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారు.

రూ.కోటి మేర అభివృద్ధి పనులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడంతో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. ముఖ్యంగా గ్రామంలో రూ.20 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టగా రూ.17.50 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.రెండు లక్షలతో ప్రతి ఒక్కరికి తాగునీరు, రూ.నాలుగు లక్షలతో వాడుక నీటి కోసం ఎస్సీ, బీసీ కాలనీలో బోరు పంపులు ఏర్పాటు చేశారు. వీరులపాడు నుంచి చౌటపల్లి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.40 లక్షలతో పైపులైన్‌లు ఏర్పాటు చేయగా రూ.10 లక్షలతో డొంక రోడ్ల అభివృద్ధి, సొసైటీ భవనానికి రూ.9 లక్షలతో ప్రహరీ నిర్మాణం, రూ.40 లక్షలతో నిర్మిస్తున్న సచివాలయ భవనం నిర్మాణ దశలో ఉంది. అంతే కాకుండా నూతనంగా పలు కాలనీల్లో రూ.40 లక్షలతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు రైతులకు వైఎస్సార్ జలకళ పథకం ద్వారా వారి పంట పొలాల్లో ఉచితంగా బోర్లు వేశారు.



గ్రామంలోని జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు



గ్రామంలోని సిమెంట్ రోడ్డు

డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.22.25 కోట్లు

చౌటపల్లి, చట్టన్నవరం గ్రామాలు కలిపి సుమారు 3,300 మంది జనాభా ఉన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆయా పథకాల ద్వారా గ్రామస్తులకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.22.25 కోట్లు అందాయి. ముఖ్యంగా నిరుపేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు చౌటపల్లి గ్రామంలో రూ.19 లక్షలకు రైతుల నుంచి భూమిని కొనుగోలు చేసి 57 మందికి ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. దాదాపుగా లబ్ధిదారులందరూ గృహాలను నిర్మించుకున్నారు.

అన్ని రకాలుగా అభివృద్ధి



గ్రామం అన్ని రకాలుగా అభివృద్ధి చెందింది. ముఖ్యంగా గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ.కోట్ల మేర అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించారు.

– పల్లెపోగు పుల్లయ్య, సర్పంచ్

సంక్షేమ పథకాలతో ఆదుకున్నారు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందించి ఆదుకున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో ప్రభుత్వం, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పనితీరు మరువలేనిది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాను.

– పల్లెపోగు సుజాత, స్థానికురాలు



పాఠశాలలో కొత్త హంగులతో నిర్మించిన మరుగుదొడ్డి

సెక్టార్ అధికారులతో ఆర్డీఓ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ: పోలింగ్ స్టేషన్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సెక్టార్ అధికారులు అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి పోలింగ్ స్టేషన్ లో చేయవలసిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్ లో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందే సిద్ధం చేసి ఉంచాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దన్నారు. సమావేశంలో తహసీల్దార్ వై.సరస్వతి, ఎన్నికల డీటీ ఇస్మాయిల్, 23 సెక్టార్ల అధికారులు పాల్గొన్నారు.

286 మందికి కంటి వైద్య పరీక్షలు

నందిగామ: పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ ఆవరణలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 286 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ వి.ప్రవీణ్ కుమార్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన సత్కారం



రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సత్కరిస్తున్న పలువురు న్యాయమూర్తులు

నందిగామ: నందిగామలో మంగళవారం రాత్రి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికతో కలిసి పలువురు న్యాయమూర్తులు ఘనంగా సత్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కూడా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సత్కరించారు. నూతన కోర్టు భవనాల ప్రాంగణంలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు మొక్కలు నాటారు. కోర్టు భవనాలలోని అన్ని గదులను పరిశీలించారు. ముఖ్యంగా కోర్టు భవనాలలో కల్పించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు, పలు కోర్టులకు చెందిన న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుచేయాలి

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పలు వినతులు చేశారు. పట్టణానికి వచ్చిన న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టును కూడా కోర్టు ప్రాంగణాలలో ఏర్పాటు చేయాలని, కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నందిగామలో ఫ్యామిలీ కోర్టు, అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు కూడా ఏర్పాటు చేయాలని కోరినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జునరావు తెలిపారు.

వడ్డెరల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

వైఎస్సార్ సీపీ యువనేత సామినేని వెంకట కృష్ణ ప్రసాద్



వేగవంతంగా జరుగుతున్న వడ్డెర శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులు

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్డెర కులస్తుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేట కబేళా రోడ్‌లో ఉన్న వడ్డెర శ్మశానవాటికలో రూ.25 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వడ్డెర కులస్తుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషి చేశారని తెలిపారు. గతంలో వడ్డెర శ్మశానవాటిక అధ్వానంగా ఉండటంతో దానిని అభివృద్ధి చేయాలని వడ్డెర్ల నాయకులు ఉదయభాను దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన నిధులు మంజూరు చేయించి శ్మశానవాటిక స్థలం అంతా శుభ్రం చేయించడంతో పాటు చుట్టూ ప్రహరీ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేయిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వడ్డెరలంతా ఉదయభానుకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

విస్సన్నపేట: విస్సన్నపేట గ్రామం శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9,720 నగదు, ఏడు బైకులు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. పేకాట, కోడి పందేలు ఇతర జూదాల సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

పేట వీధుల్లో పోలీసుల కవాతు



జగ్గయ్యపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

జగ్గయ్యపేటఅర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పట్టణ ఎస్ఐ సూర్యభగవాన్ తెలిపారు. ప్రజలు స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు గాను వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు మంగళవారం సీఐ జానకిరామ్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. పట్టణంలోని బంగారు కొట్ల సెంటర్, బలుసుపాడు సెంటర్, పాత మున్సిపల్ కార్యాలయం కూడలి, వైఎస్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

28న సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ట

కంచికచర్ల: కంచికచర్ల పెద్ద బజార్‌లో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం (రామాలయం)లో ఈనెల 28వ తేదీ ఉదయం 9.41 గంటలకు విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈనెల 24న విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, విఖనస పతాక ఆవిష్కరణ, సుదర్శన పూజ, అకల్మష హోమం జరుగుతుంది. 25న పంచగవ్య ఆరాధన, పంచగవ్యప్రాశన, వాస్తు పూజ, వాస్తుహోమం, వాస్తు పర్యగ్నీకరణ, అక్షి విమోచన, అగ్నిమథన, ప్రధాన అగ్ని ప్రణయనం, నవ కలశ స్నపన, పంచగవ్యాధివాసం, అధివాసాంగ హోమం, నీరాజనం, 26న విష్వక్సేన పూజ, చతుర్దశ కలశస్నపన, క్షీరాధివాసం, అధివాసాంగహోమం, నీరాజనం, 27న దశాంశ హోమాలు, జలాధివాసం, అధివాసాంగ హోమం, నీరాజనం, సాయంత్రం ప్రభూత బలిప్రదానం, 28న విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్ని ఆరాధన, రత్నన్యాసం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, సాయంత్రం సీతారాముల కల్యాణం జరుగుతుందని పేర్కొంది.

పేదల్ని లక్షాధికారులను చేశారు!

- జాతీయ రహదారి పక్కన జగనన్న కాలనీలు
- తోటచర్ల, నవాబుపేట గ్రామాల్లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- రూ.లక్షలు విలువ చేసే ఆస్తి సొంతం చేసుకున్న నిరుపేదలు
- జగనన్నకు జేజేలు పలుకుతున్న లబ్ధిదారులు



తోటచర్లలో జాతీయ రహదారికి ఆనుకుని ప్రైవేట్ వెంచర్ పక్కన ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ

తోటచర్ల, నవాబుపేట(పెనుగంచిప్రోలు): మండలంలోని తోటచర్ల, నవాబుపేట గ్రామాల్లో 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన జగనన్న కాలనీలు ప్రైవేట్ వెంచర్లకు దీటుగా ఉన్నాయి. తోటచర్ల గ్రామంలో జాతీయ రహదారి పక్కన 2004లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను 6 ఎకరాల 49 సెంట్లు పేదల స్థలాల కోసం కొనుగోలు చేశారు. అయితే తరువాత పలు సాంకేతిక కారణాలతో పట్టాల పంపిణీ జరగలేదు. గత టీడీపీ ప్రభుత్వం కూడా పట్టాల పంపిణీపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను 256 మందికి ప్లాట్లు కేటాయించి పట్టాలు అందజేశారు. ఆ భూమి విలువ నేడు ఎన్నో రెట్లు పెరిగింది.



నవాబుపేటలో జాతీయ రహదారి పక్కన జగనన్న కాలనీ

లక్షాధికారులైన లబ్ధిదారులు

జాతీయ రహదారి పక్కనే ఉండటంతో సెంటు రూ.4 నుంచి రూ.4.50 లక్షలు పలుకుతోంది. ప్రభుత్వం ఒక్కొక్కరికి సెంటున్నర ఇవ్వటంతో స్థలం విలువే రూ.6 లక్షలు పైగా ఉంది. నిర్మాణానికి అందించే నగదు, ఇతర సామగ్రి అన్నీ కలుపుకొని ఒక్కో ఇంటి ఖరీదు రూ.8 లక్షలు పలుకుతోంది. దీంతో ఒక్కసారిగా పేదలు లక్షాధికారులు అయ్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమను లక్షాధికారులు చేశారని వారు గర్వంగా చెబుతున్నారు. నవాబుపేటలో జాతీయ రహదారి పక్కన 3 ఎకరాల జెడ్పీ స్థలంలో 123 మందికి పట్టాలు అందించారు. ఇక్కడ కూడా సెంటు రూ.4 లక్షలకు పైగా పలుకుతోంది. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. జగనన్న కాలనీల చుట్టూ ప్రైవేట్ వ్యక్తులు వెంచర్లు చేశారు. వాటి ధర ఎకరం రూ.90 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంది. వాటికి దీటుగా కాలనీల్లో సకల సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణం కూడా పూర్తవుతోంది.

కలలో కూడా ఊహించలేదు



ఉన్నపళంగా మేము లక్షాధికారులం అవుతామని కలలో కూడా ఊహించలేదు. జాతీయ రహదారి పక్కన మాకు లక్షల విలువైన భూమిని జగనన్న కాలనీలో అందించారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. పేద వారికి ఇంతకన్నా ఏమి కావాలి. జగనన్న ప్రభుత్వంలో సొంత ఇంటి కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది.

–పులగం లక్ష్మి, తోటచర్ల

జీవితాంతం రుణపడి ఉంటాం



మా సొంత ఇంటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. జాతీయ రహదారి పక్కన సెంటు రూ.4 లక్షలు పలికే స్థలాన్ని ఇవ్వటంతో పాటు ఇంటి నిర్మాణానికి నగదు, ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు కంకర, ఇనుము ఇప్పించారు. రూ.8లక్షలకు పైగా ఆస్తి సమకూరింది.

–ఎం.తిరుపతమ్మ, నవాబుపేట

ప్రైవేట్ వెంచర్ల పక్కనే పేదల ఇళ్లు



20 ఏళ్లుగా ఉన్న సమస్యను జగనన్న పాలనలో స్థానిక ఎమ్మెల్యే ఉదయభాను పరిష్కరించారు. జాతీయ రహదారి పక్కన లక్షల విలువ చేసే భూముల్లో, ప్రైవేట్ వ్యక్తుల వెంచర్ల పక్కన ఇళ్ల ప్లాట్లు కేటాయించటంతో పేదలు లక్షాధికారులుగా మారారు.

–కన్నమాల శామ్యూల్, సచివాలయాల మండల కన్వీనర్, తోటచర్ల

జగ్గయ్యపేట బీఎస్పీ అభ్యర్థిగా ప్రభుదాసు



కొదమల ప్రభుదాసు(ఫైల్)

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థిగా పట్టణానికి చెందిన కొదమల ప్రభుదాసు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి విజయవాడలో విడుదల చేసిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో కొదమల ప్రభుదాసు పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రభుదాసు విలేకరులతో మాట్లాడుతూ బీఎస్పీ అభ్యర్థుల ప్రకటనలో తొలి జాబితాలోనే తన పేరు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పుష్పరాజ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శాంతియుత సమాజమే క్రీస్తు సందేశం

వీరులపాడు: శాంతియుత సమాజమే ప్రభువు ఏసుక్రీస్తు సందేశమని ఫాదర్ సాలే వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని బోడవాడ–జమ్మవరం గ్రామాల్లో ఉన్న పరిశుద్ధ లూర్దుమాత 75వ వార్షిక మహోత్సవాల సందర్భంగా మంగళవారం లూర్దుమాత పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమైనవని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకుని తోటి వారికి అండగా నిలవాలని తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలిపూజ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్‌లు నీలూరి మరియదాసు, బలమాల తంబి, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, గ్రామ నాయకులు యాదాల దాసు, కర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనం తనిఖీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో మూడు సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సతీష్ మంగళవారం విలేకరులకు తెలిపారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు గరికపాడు వద్ద, గండ్రాయి–వల్లభి సరిహద్దు వద్ద, ముక్త్యాల–దొండపాడు సరిహద్దు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద నిత్యం పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తారన్నారు. ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మల్కాపురం తెలంగాణకు సరిహద్దులో ఉండటంతో అక్కడ కూడా చెక్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

వత్సవాయి: గ్రామాల్లో అనుమతులు లేకుండా పార్టీ ప్రచారాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎంపీడీవో, మండల ఎంసీసీ టీసీకేజే భరత్‌రాజ్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో ఫ్లెక్సీలను మంగళవారం తొలగించడంతో పాటు జెండాల దిమ్మెలపై గుర్తులు కనపడకుండా పార్టీ రంగులతో ఉన్న వాటిపై తెల్లరంగులు వేయించారు. మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తే కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని సూచించారు.